సాక్షి
హనుమకొండ

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024

న్యూస్‌రీల్

గ్రేటర్ రెవెన్యూ మేళాకు 12 ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ రెవెన్యూ మేళాకు బుధవారం 12 ఫిర్యాదులు వచ్చాయి. నూతన భవన నిర్మాణం, ఆస్తి పన్నుల సవరణలు, ఖాళీ స్థలం, పేరు మార్పిడి తదితర సమస్యలపై కాశిబుగ్గ సర్కిల్ 5, కాజీపేట సర్కిల్ 7 దరఖాస్తులు వచ్చినట్లు బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన 'మమ్మీల్లారియ'



శాయంపేట: పెద్దకోడెపాకకు చెందిన వన ప్రేమికుడు కోమనేని రఘు ప్రకృతి వనంలో పెంచిన మెక్సికోకు చెందిన కాక్టీసీ జాతి మొక్క 'మమ్మీల్లారియా అల్బిలనాట' మొదటిసారిగా బుధవారం వికసించింది. ఈ మొక్క రాజస్థాన్ లాంటి ఎడారి ప్రాంతాల్లో పెరుగుతుందని, 2018లో ఆ రాష్ట్రం నుంచి తెప్పించినట్లు రఘు తెలిపారు. ఆరేళ్ల తరువాత వికసించిన అరుదైన పుష్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు వస్తున్నారని పేర్కొన్నారు.

న్యూ ఎడ్యుకేషన్ పాలసీపై ఆన్‌లైన్ శిక్షణ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సౌజన్యంతో న్యూ ఎడ్యుకేషన్ పాలసీపై ఆన్‌లైన్‌లో అధ్యాపకులకు ఎనిమిది రోజుల ఓరియంటేషన్ శిక్షణ తరగతులను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ బుధవారం ప్రారంభించారు. 'పరిశోధన, అభివృద్ధి' అనే అంశాలపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.కిషోర్‌కుమార్, 190 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

కేయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, అండ్ ఎంఎల్‌ఐఎస్‌సీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 1 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. మార్చి 1, 4, 6, 11, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల జరిగే ఈ పరీక్షలకు 5,512 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకు మొత్తం 33 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

26 నుంచి కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సమ్మె

- రిజిస్ట్రార్‌కు సమ్మెనోటీసు అందజేత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26 నుంచి సమ్మె చేయనున్నారు. ఈ మేరకు కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ దేవోజీ నాయక్ ఇతర బాధ్యులు బుధవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డికి సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గతంలో వర్సిటీలో 16 పీరియడ్‌లతో పనిచేసే పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేసేవారని, 2014 తరువాత ఎవరినీ కన్వర్షన్ చేయలేదన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్, రెమ్యునరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు డాక్టర్ సంజీవ్, డాక్టర్ కుమార్, డాక్టర్ శంకర్, ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



వెన్నెలమ్మ.. వచ్చిందమ్మా

అట్టహాసంగా గద్దెపైకి సారలమ్మ

- దారి పొడవునా భక్తులబారులు
- జయజయధ్వానాలతో స్వాగతం
- నీళ్లారబోసి హారతిచ్చిన కాక వంశీయుల ఆడపడుచులు
- పసుపు, కుంకుమలతో ఎదురు.. కేరింతలతో మురిసిన జనం
- దేవతను తీసుకువచ్చే వడ్డెను తాకేందుకు పోటీ..

మేడారం(ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి):

కన్నెపల్లి నుంచి వెన్నెలమ్మ తరలిరాగా.. భక్తజనం పారవశ్యంలో ఓలలాడారు. శివసత్తుల పూనకాలు.. భక్తుల శిగాలతో కన్నెపల్లి ఆలయ ప్రాంగణం మారుమోగింది. జై..సారలమ్మ.. అంటూ భక్తులు గద్దెల వరకు తోడువచ్చారు. మేడారం శ్రీ సమ్మక్క– సారలమ్మ మహాజాతరలో ప్రథమ ఘట్టం బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మొదటి రోజు కన్నెపల్లి నుంచి బయలుదేరిన సారలమ్మకు దారిపొడవునా భక్తులు నీరాజనం పలికారు. గుడిలో సాయంత్రం 6 గంటలనుంచి సారలమ్మ తరలివచ్చే తంతు ప్రారంభమైంది. సుమారు గంటన్నరపాటు ఆలయంలో ఒకవైపు కాకవంశీయుల ఆటపాటలతో సందడిగా మారింది. ఇంటినుంచి పూజాసామగ్రితో ఆడపడుచులతో కలిసి ఆలయానికి చేరుకున్న ప్రధాన వడ్డె కాక సారయ్య ఆలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. పూజారి హారతివ్వగా.. కొద్దిసేపటి తరువాత మరో పూజారి బూర ఊదారు. బుధవారం రాత్రి 7.40 గంటలకు ప్రధాన పూజారి కాక సారయ్య.. సారలమ్మను చేతిలో పట్టుకోగా.. హనుమాన్‌జెండాతో బయటకు తీసుకువచ్చారు. హనుమంతుడి నీడలో రావడం అమ్మవారి అభయంగా ఉంటుందని విశ్వాసం. అమ్మవారి గుడి ముందు పెళ్లికాని కన్నెపిల్లలు, యువకులు, అనారోగ్యం, సమస్యలతో బాధపడుతున్న భక్తులు వరం పట్టారు. నేలపై పడుకున్నవారి పైనుంచి సారలమ్మ వెళ్తే శుభం కలుగుతుందని విశ్వాసం. అక్కడినుంచి మేడారం బయలుదేరారు. కన్నెపల్లిలోని కాక వంశీయులు ఆడబిడ్డల ఇళ్లవద్దకు సారలమ్మ తరలివెళ్లగా వారు మంగళహారతులు ఇచ్చి నీళ్లు ఆరబోశారు. ఎర్రనీళ్లతో దిష్టితీసి కొబ్బరికాయలను కొట్టారు. తల్లివస్తుందని తెలుసుకున్న భక్తులు విడిది ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున రోడ్డుపైకి చేరి పసుపు, కుంకుమలను ఎదురుచల్లారు. నాలుగంచెల రోప్‌పార్టీని దాటుకొని వడ్డెలు, పూజారులను తాకాలనే ఆతృతతో ముందుకు సాగేందుకు ప్రయత్నించారు. వడ్డె సారయ్య.. జంపన్నవాగులో అమ్మవారి కాళ్లుకడిగి మేడారం చేరుకున్నారు. తల్లి సమ్మక్క గుడికి చేరి దర్శించుకోవడానికి ముందుగానే..అప్పటికే సమ్మక్క గుడి వద్దకు చేరుకున్న పగిడిద్దరాజు, గోవిందరాజులతో కలిసి సారలమ్మ గద్దెలపై కొలువుదీరింది. అమ్మతోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజును వారి వారి గద్దెలపై పూజారులు ఆదివాసీ సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించారు. సారలమ్మను ప్రతిష్ఠించే సమయంలో గద్దెల దర్శనాలను గంటపాటు నిలిపివేశారు. ఈ క్రమంలో మూడుమార్లు విద్యుత్ లైట్లను నిలిపివేసి మళ్లీ ఆన్ చేశారు.

పోలీసుల భారీ బందోబస్తు..

కన్నెపల్లి నుంచి సారలమ్మను పోలీసులు భారీ బందోబస్తు మధ్య గద్దెలపైకి తీసుకువచ్చారు. సారలమ్మ గద్దెపై కొలువుదీరడానికి ముందే పోలీసులు నాలుగు రోప్‌పార్టీలు ఏర్పాటు చేసి వాటి మధ్యలో కన్నెపల్లి ఆదివాసీ యువకులు పూజారులతో కలిసి తల్లిని గద్దెపైకి తీసుకొచ్చారు. రెండు బ్రిడ్జిలు ఉన్నప్పటికీ సారలమ్మను జంపన్నవాగు నీటిలో నుంచి తీసుకురావడం ఆనవాయితీ. ఉదయం ఎస్పీలు శబరీష్, గాష్‌ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ ఆధ్వర్యంలో జంగిల్ డ్రెస్‌తో కూడిన బలగాల మధ్య రోప్ పార్టీ సాగింది.

దగ్గరుండి తరలించిన మంత్రి

సారలమ్మను తీసుకురావడానికి రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ కన్నెపల్లి గుడికి చేరుకున్నారు. అక్కడ పూజాక్రతువును స్వయంగా పరిశీలించి ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సారలమ్మను తీసుకువచ్చారు.

కిక్కిరిసిన జనం

ఎటు చూసినా భక్తజనంతో కిక్కిరిసిపోయింది. మంగళవారం రాత్రి ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో పెద్ద ఎత్తున తరలివచ్చారు. బుధవారం రాత్రివరకు మేడారం పరిసర ప్రాంతాలు గుడారాలతో నిండిపోయాయి. జంపన్నవాగు వద్ద ఇసుకేస్తే రాలని పరిస్థితి ఏర్పడింది. వాగులో స్నానాలు ఆచరించిన తర్వాత గద్దెల వద్దకు చేరడానికి కాలినడకన వస్తుండడంతో ఒక్క వాహనం కూడా ముందుకు కదలలేని పరిస్థిత నెలకొంది. రెడ్డిగూడెం, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. వనదేవతలను దర్శించుకునేందుకు గద్దెల ప్రాంగణంలో పెద్ద ఎత్తున బారులుదీరారు. వీవీఐపీ, వీఐపీల క్యూలైన్లలోనూ భక్తుల రద్దీ నెలకొంది. మూడు కిలోమీటర్లకు ఒక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తల్లుల దర్శనం, జంపన్న వాగుకు దారి, ఆర్టీసీ బస్సులు వెళ్లే రూట్‌లపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద సమాచారాన్ని మైకుల్లో తెలుపుతూ తప్పిపోయిన వారిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.



సారలమ్మను తీసుకువస్తున్న వడ్డె పూజారులు, (ఇన్‌సెట్‌లో) సారలమ్మ గుడి వద్ద జనసందోహం, చెట్టు ఎక్కి వీక్షిస్తున్న భక్తులు

నేడు వరాల తల్లిరాక

- ఉద్విగ్నభరితంగా సాగనున్న వేడుక
- గుట్ట నుంచి గద్దెపైకి రానున్న సమ్మక్క



ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి: వరాల తల్లి సమ్మక్క నేడు(గురువారం) చిలకలగుట్ట పైనుంచి గద్దెకు చేరే ఘడియలు ఆసన్నమయ్యాయి. వనం నుంచి జనంలోకి సమ్మక్క రానుంది. ఈ సందర్భంగా వరాల తల్లికి స్వాగతం పలికేందుకు భక్తులు ఎదురుచూస్తున్నారు. అమ్మవారి రాకకు ముందుగా సమ్మక్క పూజారులు గుడిలో శక్తిపీఠాన్ని అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎవరినీ లోనికి రానివ్వకుండా కట్టుదిట్టం చేసి రహస్య క్రతువు చేపడతారు. అనంతరం గుడి నుంచి పూజా సామగ్రి తీసుకువచ్చి గద్దె అలికి కంకవనాలను కట్టి కుంకుమ, పసుపులతో అలంకరిస్తారు. ఏకాంతంలో నిర్వహించే ఈ ప్రక్రియ సందర్భంగా ఎవరినీ లోనికి రానివ్వరు. అలాగే మేడారంలోని ఆడపడుచులు, ఆదివాసీ కుటుంబాలు, పూజారులు, వడ్డెలు సైతం సమ్మక్క రాకకు ఆహ్వానంగా వారి ఇళ్లను ముగ్గులతో అలంకరిస్తారు. ఇదిలా ఉండగా.. పోలీసులు, రోప్‌పార్టీ సిబ్బంది చిలకలగుట్ట నుంచి గద్దెల వరకు రిహార్సల్స్ చేశారు. అమ్మవారు వచ్చే దారికి ఇరువైపులా బారికేడ్లు అమర్చిన పోలీసులు బుధవారం నుంచి బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి ఆగమనం కోసం కోటి మంది భక్తులు ఎదురుచూస్తున్నారు.



బుధవారం అర్ధరాత్రి తర్వాత విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న వనదేవతల గద్దెలు, కిక్కిరిసిన భక్తజనం,(ఇన్‌సెట్) గద్దెలపై గోవిందరాజు, పగిడిద్దరాజు

సారలమ్మ ఆగమనం ఇలా..

కన్నెపల్లి గుడిలో తంతు
ప్రారంభం సాయంత్రం 6-40
సారలమ్మ గుడి నుంచి బయటకు రాత్రి 7-40
కన్నెపల్లి ఊరిపొలిమేరకు రాత్రి 8.00
జంపన్నవాగుకు చేరుకున్న సమయం 9.00
జంపన్నవాగు దాటింది రాత్రి 9.10
సమ్మక్క గుడికి రాత్రి 10.16
గద్దెలపై ప్రతిష్ఠాపన అర్ధరాత్రి 12:12

- వివరాలు 8లో▸

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు

- జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ

హన్మకొండ: పరీక్షల రాసే విద్యార్థులు ఒత్తడికి లోనుకావొద్దని హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై అన్నారు. బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో వడుప్సా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలపై నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు సమీపించినందున విద్యార్థులు పూర్తిగా చదువుపైనే దృష్టి సారించాలన్నారు. వడుప్సా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాల సతీష్ కుపమార్, ప్రతినిధులు వి.ముక్తీశ్వర్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలి

- అదనపు కలెక్టర్ మహేందర్ జీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మహేందర్‌జీ, అధికారులు

హన్మకొండ : మేడారం జాతరలో ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ అన్నారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహేందర్ జీ, జిల్లా రెవెన్యూ అధికారి గణేష్ పాల్గొని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ జీ మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని జాతరలోనే కాకుండా ఎప్పుడు కూడా వాడొద్దన్నారు. పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం నుంచి చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక బాధ్యులు కె.పురుషోత్తం, శ్రవణ్ కుమార్,వి.శ్రీనివాస్, అనితారెడ్డి, శాంతారామ్ కర్ణ, ఎ.సంపత్ కుమార్, మండల పరుశరాములు, రవిబాబు పాల్గొన్నారు.

పోలీస్ కొలువు సాధించినందుకు గర్వపడాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మడికొండ: పోలీస్ కొలువు సాధించినందుకు గర్వపడాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం మడికొండ శివారు సిటి పోలీసు శిక్షణ కేంద్రంలో ప్రారంభమైన స్టయిఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్ల(సివిల్) శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణ కోసం వచ్చిన వారు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ శిక్షణ సమయంలో తెలిపే అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. సమాజంలో ప్రజల హక్కులను, చట్టాలను పరిరక్షించే బాధ్యత మీ భుజస్కందాలపై ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుంటే భవిష్యత్‌లో మీకు అప్పగించిన విధుల్లో రాణించడం ద్వారా అధికారుల నుంచి వ్యక్తిగత గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అనంతరం పోలీసు కమిషనర్ చేతుల మీదుగా పోలీసు వాచకాలను ట్రెయినీ కానిస్టేబుళ్లకు అందజేశారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ రాగ్యానాయక్, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఆర్ఐ ఉదయ్‌భాస్కర్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, సీటీసీ ఎస్సైలు లలిత, రాజు, హరికృష్ణ, రణధీర్, విఠల్, సతీష్, ఏఎస్సై నర్సయ్య పాల్గొన్నారు.


తల్లుల దర్శనానికి బారులుదీరిన భక్తులు


అమ్మవార్ల గద్దెల వద్ద భక్తజన సందోహం


నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్


చెట్టు ఎక్కుతున్న శివసత్తి




జంపన్న వాగులో వరం పడుతున్న భక్తులు

మేడారం.. జనసంద్రం

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం జనసంద్రమైంది. బుధవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులు, తాడ్వాయి మండలం కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొచ్చి మేడారంలోని గద్దెలపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని తల్లులకు పసుపు, కుంకుమ, చీరెసారె, ఎత్తుబెల్లం సమర్పించి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. సమీప అటవీప్రాంతాల్లో సహపంక్తి భోజనాలు చేశారు.


జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


సెల్ఫీ తీసుకుంటున్న భక్తులు



ప్లాస్టిక్‌ను పాతరేయండి..

- మేడారంలో కాలుష్యంపై అవగాహన

మేడారం(వరంగల్) : పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ)కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి పర్యవేక్షణలో మేడారంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జాతరలోని గిరిజన మ్యూజియంలో టీఎస్‌పీసీబీ ఎగ్జిబిషన్ స్టాల్‌లో ప్లాస్టిక్ హానికర ప్రభావాల గురించి భక్తులకు అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా మట్టి, చెక్క, కాగితం, వెదురుతో తయారు చేసిన సహజ ఉత్పత్తులు స్వీకరించాలని కోరారు. ఇవి ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుతాయని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పార్కింగ్ పరేషాన్..



వరంగల్ క్రైం : తల్లులను తనివితీరా దర్శించుకునేందుకు మేడారం జాతరకు చేరుకున్న కొంత మంది భక్తులు పోలీసుల పని తీరుతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పస్రా, కాటారం వైపు నుంచి ఊరట్టం, కన్నెపల్లి మీదుగా గద్దెల వైపు వస్తున్న భక్తులకు బీ1, బీ2, సీ1, సీ2 పార్కింగ్ స్థలాల వద్ద చేదు అనుభవం ఎదురైంది. పార్కింగ్ స్థలాలు విశాలంగా ఉన్నప్పటికీ వాహనాలు నిలపొద్దంటూ పోలీసు సిబ్బంది అడ్డగించడంతో పాటు వాహనాలను కొట్టారు. భక్తులను తోసివేస్తూ వాహనాలను దూరంగా పార్కింగ్ చేసుకోవాలని హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులకు, భక్తులకు వాగ్వావాదం చోటు చేసుకుంది.

గద్దెలకు చేరిన లక్ష్మీదేవర..



ఏటూరునాగారం: భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట నుంచి లక్ష్మీదేవరను బుధవారం మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొచ్చారు. ఐటీడీఏ తుడుందెబ్బ వలంటీర్ల సమక్షంలో అమ్మవారు జంపన్నవాగు మీదుగా రెడ్డిగూడెం గద్దెలకు డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. గుర్రంబొమ్మతో ఉన్న లక్ష్మీదేవరకు భక్తులు చీరసారె, కానుకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెట్టెక్కించి.. సేదతీర్చి!

మేడారం(కాళేశ్వరం): కిలోమీటర్ల మేర వాహనాలు. చుట్టూ భక్తజనం. ఎక్కడ చూసినా రద్దీ. జంపన్న వాగు వెళ్లే దారిలో బుధవారం రెండు 108 వాహనాలు భక్తుల మధ్యలో చిక్కుకుపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. దీంతో నిలుచోవడానికి కూడా స్థలం లేకపోవడంతో పక్కనే ఉన్న ఓ చెట్టు పైన తమ పిల్లలను ఎక్కించి చిన్నారులను సేదతీర్చారు. గంట తర్వాత పోలీసులు అతి కష్టం మీద ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



శివసత్తుల పూనకాలు.. ఒడి బియ్యం పూజలు

మేడారంలో శివసత్తులకు ప్రత్యేక స్థానం

- అమ్మవార్ల వాక్కు పలికేది శివసత్తుల నోటనే
- నెల రోజుల ముందు నుంచే ప్రత్యేక పూజలు
- అమ్మవార్లు పూనిన పురుషులు నెలంతా స్త్రీ వేషధారణతో..

సాక్షి, మహబూబాబాద్: కల్మషం ఎరుగని మన్నెం వాసులు నిర్వహించే ఆసియాలోని అతి పెద్ద జాతర మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర. అయితే అమ్మవార్లతోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న దేవతా మూర్తులను తీసుకొచ్చే వారు. పూజలు నిర్వహించే వారికి ఏ వేదాలు, మంత్రాలు తెలియదు. అయితే వారి పూర్వీకుల నుంచి నేర్చుకున్న పూజా విధానమే తరతరానికి వరంగా వస్తోంది. దీనిని వారు వారసత్వ సంపదగా భావించి పూజలు చేస్తారు. అయితే ఈ పూజల్లో శివసత్తుల పాత్ర కూడా కీలకమే.

నెలరోజుల ముందు నుంచే..

ఏ దేవతైనా శివసత్తుల శివం ఊగనిదే మొక్కులు చెల్లించడం కుదరదు. అంతటి మహాత్యం ఉన్న శివసత్తులకు సమ్మక్క–సారలమ్మ జాతర కీలకంగా భావిస్తారు. పుష్యమాసం పౌర్ణమిరోజు నుంచి వీరి దీక్షలు మొదలవుతాయి. అప్పటి నుంచి అత్యంత నిష్టతో ఉంటారు. ఇంట్లో ఒడి బియ్యం పోసుకుంటారు. సమ్మక్క తండ్రిగా భావించే శివయ్య(వేములవాడ రాజరాజేశ్వరస్వామి)కి ముందుగా పూజలు చేసి ఒడి బియ్యం సమర్పించి వస్తారు.

నెలరోజులు స్త్రీ వేషధారణలోనే..

శివసత్తుల్లో మహిళలకన్నా పురుషులకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందంటారు. ఇందులో ట్రాన్స్‌జెండర్లతోపాటు, అమ్మవారు పూనిన పురుషులు నెలరోజుల పాటు స్త్రీ వేషధారణలోనే ఉంటూ పూజలు చేస్తారు. ఈ సమయంలో తాము పురుషులం అన్న భావనే లేకుండా వ్యవహరిస్తారు. అలాంటి వారికి పూజలు చేస్తే కోర్కెలు తీరుతాయని, ఇంట్లో ఉన్న నెగెటివ్ తొలగి పోతుందని నమ్మకం.

అమ్మవారి వాక్కులు పలికేది వీరే..

'జారు జారు బండల్లా.. అబ్బియా.. జంపన్న వాగుల్లా.. అబ్బియా..' అంటూ దేవతల వాక్కు పలికేది శివసత్తులే.


ఒడిబియ్యంతో వస్తున్న పూజారులు

పూజాకార్యక్రమాలు నిర్వహించే సమయంలో జరిగే అవకతవకలు, ఇతర మొక్కుల గురించి శివసత్తులు చెబితే అమ్మవార్లు చెప్పినట్లుగా భక్తులు భావిస్తారు. ఒడిబియ్యంతో మేడారం వెళ్లిన శివసత్తులకు గుడిలోనూ ప్రత్యేక స్థానం ఉంటుంది. పడిగె వద్ద పూజలు చేయడం, జంపన్న వాగులో తల్లీ బిడ్డలతోపాటు 101 మంది సమ్మక్క సంతానంపై పూనకాలు వస్తాయి. అక్కడ భక్తులు శివసత్తుల వద్దకు వచ్చి తమ సమస్యలు, కోర్కెలు చెప్పుకోవడం, భవిష్యత్ గురించి అడుగుతారు. మేడారం నుంచి వచ్చిన తర్వాత ఇళ్లలో మర్లు పండుగ చేసుకొని సాధారణ జీవనంలోకి వెళ్తారు.

ఒడి బియ్యం మొక్కులు

అమ్మవార్లు పూనిన శివసత్తులను దేవతల ప్రతిరూపాలుగా భావిస్తారు. మేడారం మొక్కుల చెల్లింపు.. కొత్తగా కోరికలు కోరుకునే వారు ముందుగా శివసత్తులకు ఒడి బియ్యం పోసి పూజలు చేస్తారు. బియ్యంలో నూనె, పసుపు, కుంకుమ, చీరె, రవిక ముక్క, పోకలు, తమలపాకులు, కొబ్బరి కుడుకలు, ఖర్జూరాలు, గాజులు, పూలు, పండ్లు తెల్లటి వస్త్రంలో పోసి శివసత్తుల నడుముకు కడుతారు. ఈ తంతులో భాగంగా ఇళ్లలో అమ్మవార్ల గద్దెలను లేదా ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు.

దొంగల హల్‌చల్..

- జంపన్నవాగు వద్ద భారీగా చోరీలు
- ఒకే రోజు 14 కేసులు నమోదు
- పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగలు

మేడారం(వరంగల్ క్రైం) : తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతరలో తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి వస్తుండగా వారి బంగారం, నగదును అపహరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఒకే రోజు 14 చోరీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం ఖమ్మానికి చెందిన గడ్డం లక్ష్మికి సంబంధించిన రూ.75 వేల విలువైన బంగారం, భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన నూలి భద్రమ్మకు సంబంధించిన రూ.65 వేల నగదు, రూ.50 వేల విలువైన బంగారం చోరీ చేశారు. అలాగే, ఊరట్టం స్తూపం వద్ద వెలిశాల సరోజ అనే మహిళకు చెందిన రూ.1.75 లక్షల విలువైన బంగారం, సిద్దిపేటకు చెందిన ఈరి రాజలింగానికి చెందిన రూ.32 వేల నగదు, కరీంనగర్‌కు చెందిన దుర్గపు గీతకు సంబంధించిన రూ.1.25 లక్షల విలువైన బంగారం చోరీ చేశారు. అలాగే, వరంగల్‌కు చెందిన మాదాసి బంకలక్ష్మికి చెందిన రూ.1.25 లక్షల విలువైన బంగారం, చెల్పూరుకు చెందిన మండల సమ్మక్కకు చెందిన రూ. లక్ష విలువైన బంగారం ఎత్తుకెళ్లారు. మంచిర్యాలకు చెందిన చిందం రాధకు సంబంధించిన రూ.1.25 లక్షల విలువైన బంగారం, సికింద్రాబాద్‌కు చెందిన మట్టు యాదమ్మకు చెందిన రూ.1.75 లక్షల విలువైన బంగారం, కేసముద్రానికి చెందిన గువ్వ వీరన్నకు చెందిన రూ.1.75 లక్షల విలువైన బంగారం, మహదేవ్‌పూర్‌కు చెందిన ముత్తి పుష్పమ్మకు సంబంధించిన రూ.1.50 లక్షల విలువైన బంగారం, నర్సంపేటకు చెందిన పాలిత సునీతకు చెందిన రూ.3.25 లక్షల విలువైన బంగారం దొంగలు అపహరించారు.

పోలీసుల అదుపులో అంతర్ రాష్ట్ర దొంగలు...

అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు మేడారంలో ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం పలు చోరీలకు పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాళ్లపల్లిగూడేనికి చెందిన, మహారాష్ట్రలోని పూణెకు చెందిన దొంగలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

వరంగల్ క్రైం : మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన ముగ్గురిని మేడారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వాజేడు మండలం ధర్మారానికి చెందిన ముగ్గురు యువకులు ములుగులో ఎక్కారు. ఈ క్రమంలో తాడ్వాయి సమీపంలో మద్యం మత్తులో డ్రైవర్ వెంకటయ్యపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సదరు యువకులపై డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మేడారం పయనం..

గంగారం : వనదేవతలు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకోగానే మేడారం మహాజాతర ప్రారంభవుతుంది. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. అయితే మేడారం జాతర ముగియగానే ఏజెన్సీ ప్రాంతాల్లో మొత్తం 25 ఇలవేల్పుల జాతరలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో గంగారం మండలంలో చుంచ వారి ఇలవేల్పు బాలకుమారస్వామి, యాప వారి ఇలవేల్పు శిదాలమ్మ , కామారంలో కల్తి వారి ఇలవేల్పు కాసాలనాయుడు, గంగారంలోని చింత వారి ఇలవేల్పు గాదే రాజు జాతరకు సంబంధించిన ప్రతినిధులు బుధవారం మేడారానికి కాలి నడకన వెళ్లారు. ఈసందర్భంగా చుంచ పాపయ్య, రాజేష్, యాప భూమయ్య, శ్రీరాములు, బ్రహ్మయ్య, చింత వజ్జయ్య మాట్లాడుతూ తమ ఆరాధ్య దైవమైన ఇలవేల్పుల జాతరలను ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.


కాలి నడకన మేడారం వెళ్తున్న ఇలవేల్పుల జాతర ప్రతినిధులు

తల్లుల సేవకు తరలిన వలంటీర్లు..



మేడారం తరలుతున్న ఆర్ట్స్ కళాశాల వలంటీర్లు

కేయూ క్యాంపస్: మేడారం జాతరలో సేవలు అందించడానికి కేయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తరలారు. జాతరలో సేవలు అందించడానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పంపాలని ములుగు జిల్లాకు చెందిన అధికారులు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణను కోరారు. అయితే రెండు, మూడురోజుల నుంచి నారాయణ సంప్రదించినా అధికారులు స్పందించలేదు. దీంతో మేడారం వెళ్లడానికి ఈనెల 20వ తేదీన కేయూకు చేరుకున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తిరిగి ఇళ్లకు వెనుదిరిగారు. ఈనేపథ్యంలో మళ్లీ పంపాలని కోరడంతో బుధవారం 50మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధికారులతోపాటు ఈసం నారాయణ మేడారం వెళ్లారు. అలాగే భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం నుంచి మరో 50మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను మేడారం పంపినట్లు నారాయణ తెలిపారు. కాగా, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలోని జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు బుధవారం మేడారం వెళ్లారు.

ప్రత్యేక రైళ్లలో భక్తులు

- కిక్కిరిసిన వరంగల్ రైల్వేస్టేషన్


ప్రయాణికులను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్ మేడారం భక్తులతో కిక్కిరిసింది. మూడు ప్రత్యేక రైళ్లలో భక్తులు వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని సమీపంలోని బస్సుల ద్వారా మేడారం జాతరకు వెళ్తున్నారు. తొలిరోజు బుధవారం ఉదయం 11 గంటలకు మొదటి ప్రత్యేక రైలు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి వరంగల్‌కు చేరుకుంది. మధ్యాహ్నం 2గంటలకు రెండో రైలు సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు చేరుకుంది. సాయంత్రం 4.20 గంటలకు మూడో రైలు నిజామాబాద్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ ప్రత్యేక రైళ్లు 24 శనివారం వరకు నడవనున్నాయి. కాగా, గురువారం సమ్మక్క గద్దెపైకి రానుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

సీపీ ట్రాఫిక్ పర్యవేక్షణ



మేడారం (వరంగల్ క్రైం) : మేడారం జాతరకు తరలివస్తున్న వేలాది వాహనాలను క్రమబద్ధీకరించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్, మేడారం మహాజాతర ట్రాఫిక్ ఇన్‌చార్జ్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పస్రా నుంచి మేడారం వెళ్లే మార్గంలో బుధవారం వాహనాలు జామ్ కావడంతో స్వయంగా ట్రాఫిక్‌ను సీపీ క్లియర్ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ



మేడారం(రామన్నపేట) : మేడారం జాతరను పురస్కరించుకొని బుధవారం వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఇండియన్ అగ్రిటెక్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ బాటిళ్లను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. సుమారు 10వేల వాటర్ బాటిళ్లను భక్తులకు అందించారు.

పార్కింగ్‌కే పరిమితం..


పార్కింగ్‌కే పరిమితమైన వాహనం

మేడారం(వరంగల్ చౌరస్తా) : జాతరలో మహిళ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన మొబైల్ టాయిలెట్ వాహనాలు పార్కింగ్‌కే పరిమితమయ్యాయి. గద్దెలు, జంపన్నవాగు, తదితర జనసామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయకుండా పార్కింగ్ చేయడంతో భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాన్‌వెజ్‌పై నజర్..

మేడారం (ఎంజీఎం) : మేడారం జాతరలో కోళ్లు, మేకలు, గొర్రెల విక్రయాలపై పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం పలు షాపులు తనిఖీ చేసి ఆరోగ్యకర కోళ్లు, మేకలు, గొర్రెలను విక్రయిస్తున్నారో లేదో పరిశీలించారు. ఆరోగ్యకర మాంసమే విక్రయించాలని ఆదేశించారు.